క్లుప్తంగా

శృంగార వల్లభుని ఆదాయం రూ.2.43 లక్షలు



పెద్దాపురం: స్థానిక శృంగార వల్లభుని ఆలయానికి శనివారం సాధారణ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి 2,43159 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు నాలుగు వేల మంది స్వామిని దర్శించుకున్నారు.

సుబ్బిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేటకు చెందిన పెనుమల్లు సుబ్బిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సుబ్బిరెడ్డి కేఎస్ఈజెడ్ పోరాట కమిటీలో కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం గ్రామంలో పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట కాజులూరి నేరెళ్లరెడ్డి, పాపిరెడ్డి, నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం

పిఠాపురం: కొత్తపల్లి మండలం ఉప్పాడలో రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఎమ్మెల్యేను కలిసి తమ గ్రామంలో నిర్మించనున్న రామాలయానికి సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి రూ.50 వేల విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మరిడమ్మకు బుక్కా సంబరం



సంబరంలో భాగంగా నిర్వహిస్తున్న గరగ నృత్యం

పెద్దాపురం: మరిడమ్మ తల్లి ఆలయంలో శనివారం బుక్కా సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ సంప్రోక్షణ అనంతరం ఈఓ సీహెచ్ రామ్మోహనరావు, ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీల ఆధ్వర్యంలో గరగలతో బుక్కా సంబరం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆరో తేదీ నుంచి టీడీపీ బస్సు యాత్ర

సామర్లకోట: వచ్చే నెల ఆరో తేదీ నుంచి పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో నిర్వహించనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. శనివారం అచ్చంపేటలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని బస్సు యాత్ర షెడ్యూల్‌ను వివరించారు. టీడీపీ నాయకులు రాజా సూరిబాబురాజు, అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

సామర్లకోట: మండలం వేట్లపాలెం ఆదిలక్ష్మి రైస్ మిల్లులో పనిచేస్తున్న కార్మికుడు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రైస్ మిల్లులో పని చేస్తున్న దళాల నూకరాజు (36) శుక్రవారం రాత్రి 20 అడుగుల ఎత్తు నుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

29న ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: ఈ నెల 29న తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ బీవీఆర్ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారు శేష శయన రజిత అలంకరణలో దర్శనమిస్తారన్నారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పేదింట సొంతింటి పండగ

- తీరదనుకున్న కల సాకారం
- 50 ఎకరాల్లో 2444 మందికి లబ్ధి
- జగనన్న మేలు మరువబోమంటున్న లబ్ధిదారులు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో పేదింత సొంతింటి కల సాకారమవుతోంది. ఏళ్ల తరబడి నిరీక్షణకు జగనన్న ప్రభుత్వంలో ఫలితం దక్కుతోంది. మున్సిపాలిటీ పరిధిలో 50 ఎకరాలు సేకరించి 2,444 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. పెద్దాపురం, సామర్లకోట, ప్రత్తిపాడు, పిఠాపురం రోడ్ల కూడలిలో లే అవుట్ ఉండటంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా 1850 మంది ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించగా, సుమారు వెయ్యి ఇళ్లు పూర్తయ్యాయి. 350 మంది వరకు గృహ ప్రవేశాలు చేశారు.

సుందర లే అవుట్‌కు రాష్ట్రంలో ప్రథమ స్థానం

ప్రతిపాడు రోడ్డులో వెళ్తున్న వారికి రహదారికి ఇరువైపులా జగనన్న కాలనీ లే అవుట్ సుందరంగా కనిపిస్తోంది. మౌలిక వసతులతో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగడంతో కేంద్ర ప్రభుత్వ బృందం ఈ పురస్కారానికి సిఫార్సు చేసింది. దాంతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలోను, దేశ వ్యాప్తంగా ఐదో స్థానంలోను సామర్లకోట జగనన్న కాలనీ అవార్డు దక్కించుకుంది.



సామర్లకోట ఈటీసీలో జగనన్న లే అవుట్‌లో ఇళ్లు

సొంతింటి కల నేర వేరింది



పరాయి పంచన అద్దెకు ఉండే మాకు ముఖ్యమంత్రి ఒక సోదరుడిగా ఆదుకుని స్థలం ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణానికి వలంటీర్లతో ప్రోత్సహించారు. దాంతో సెంటు స్థలంలో ఇల్లు నిర్మించుకున్నాం. గృహ ప్రవేశం చేసుకొని ఎంతో సంతోషంగా ఉన్నాం. ఏళ్ల తరబడి ఆశిస్తున్న సొంతింటి కల నేటికి నెరవేరింది.

– నడికట్ల మంగ, గృహిణి, సామర్లకోట

సెంటు భూమిలో ఇల్లు



నా భర్త దుర్గబాబు దుస్తుల వ్యాపారం చేస్తాడు. పేరుకు పెద్ద సామాజిక వర్గం ఉండటానికి ఇల్లు లేక 20 ఏళ్లుగా ఇబ్బంది పడ్డాం. వీర్రాఘవపురంలో అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. జగనన్న కాలనీలో స్థలం ఇస్తే సొంతిల్లు నిర్మించుకున్నాం. ఈ ప్రభుత్వంలో అన్ని రకాలుగా లబ్ధి పొందాం. సీఎం మేలు జీవితంలో మరచిపోలేం.

– కట్టా పద్మావతి, లబ్ధిదారు, సామర్లకోట

అన్ని సదుపాయాలతో ఇంటి నిర్మాణం

నా భర్త సతీష్‌కుమార్ సెక్యూరిటీ గార్డుగా, నేను బ్యాకరీలో పని చేస్తున్నాం. ఇప్పటి వరకు ఇరుకుగా ఉండే అద్దె ఇంటిలో ఉండే మాకు సొంత ఇల్లు సమకూరింది. జగనన్న కాలనీలో సెంటు స్థలంలో బెడ్ రూమ్, హాల్, వంట గది, బాత్ రూమ్ నిర్మించుకున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు మా ఇంటికి రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– ఎం.సాయిపద్మ, లబ్ధిదారు, సామర్లకోట



సాయిపద్మ దంపతుల ఇంటిని పరిశీలించిన కేంద్ర సహాయ మంత్రి, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

భక్తి శ్రద్ధలతో కుమార షష్ఠి ఉత్సవం



పంచారామ క్షేత్రంలోని కుమారస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలోని కుమారస్వామి ఆలయంలో శనివారం షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆషాఢ శుద్ధ షష్ఠిని కుమార షష్ఠిగా భావిస్తారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్వామి వారికి ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్‌లు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సోమవారం ఆలయంలోని మహిషాసుర మర్ధిని అమ్మవారికి అభిషేకాలు జరుగుతాయని, ఆ రోజు తొలి ఏకాదశి కావడంతో విష్ణుమూర్తి ఆలయంలో అభిషేకాలు, పూజలు ఉంటాయన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయం



గడప గడకూ మన ప్రభుత్వంలో ప్రజా సమస్యలు వింటున్న దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- ఆనూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెద్దాపురం : పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన ధ్యేయమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. 'గడప గడపకూ ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురం మండలంలోని ఆనూరు గ్రామంలో సర్పంచ్ నూకతాటి అనితారాణి, సింగన త్రిమూర్తులు, కూనపురెడ్డి స్వామి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సింగన శివ, నాగబోయిన రాజుబాబులతో కలసి లబ్ధిదారులతో మాట్లాడారు. పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి, సమస్యలను తెలుసుకున్నారు. మహిళాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, కామన రామకష్ణ, పెంకే రాంబాబు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి బుల్లెమ్మ

పెద్దాపురం: ప్రతి విద్యార్థీ అన్ని అంశాలపైనా పూర్తి అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ అన్నారు. లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పద్మనాభ కాలనీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలికా చట్టాలపై విద్యార్థులు అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన న్యాయ సేవలపై న్యాయవాదులు కందుల వెంకటాచలం, ఎం.రాంబాబు, ఎస్.విశాలక్ష్మి, కేవీ చలం, ఎస్.దుర్గారావు, పలు సూచనలు ఇచ్చారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేదుల మణి, పారా లీగల్ వలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, కె.నానిబాబు, చందు, సూర్యనారాయణ మూర్తి, భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన



జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

కొత్తపల్లి: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్థానిక పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ అన్నారు. కొత్తపల్లి గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న పాల వెల్లువపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు మేలు చేకూరుతుందన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం ఎన్నో రాయితీలు కల్పిస్తోందన్నారు. రైతులు పాలవెల్లువ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తురకల కొండను పరిశీలించిన అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం కొడవలిలో తురకల కొండను కాకినాడ ఆర్డీఓ సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఇటీవల మైనింగ్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతు గ్రామంలో కొందరు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో అధికారులు కొండ భూములను పరిశీలించారు. ఆయన వెంట పోలీసు, అటవీ, మైన్స్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

అతివేగం ప్రమాదకరం



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై గరగారావు

సామర్లకోట: వర్షాల సీజన్ ప్రారంభం కావడంతో ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులతో రైల్వే స్టేషన్ సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాల వల్ల బ్రేకులు ఫెయిలై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైవరు సీటు వెనుక భాగంలో తప్పనిసరిగా ఆటో నెంబరు ప్రయాణికులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఇటీవల కాలంలో అనేక మంది ప్రయాణికులు తమ బ్యాగ్‌లను ఆటోల్లో మరచిపోయినట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, ఆటో నంబర్ ఉంటే వెంటనే డ్రైవర్లను అప్రమత్తం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఆకట్టుకుంటున్న బిజినెస్ ఎక్స్‌పో

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బీఎస్‌వి బిజినెస్ ఎక్స్‌పో నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ప్రదర్శనలో ఉంచిన వస్తువులు నగర ప్రజలను ఆకర్షిస్తున్నాయి. నిర్వాహకులు శ్రీకర్ మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడేలా ఈ ఎక్స్‌పోలో 55 రకాలకు పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. అందరికీ అవసరమైన హోమ్ డెకార్స్, కన్‌స్ట్రక్షన్, రియల్ ఎస్టేట్, గోల్డ్ జ్యూయలరీ, గార్మెంట్, కంప్యూటర్స్, ఆటోమొబైల్స్ స్టాల్స్‌ను ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. ఆదివారం రాత్రి 9 గంటలు వరకూ ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. కాకినాడ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



పిఠాపురంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పట్టణం జగ్గయ్య చెరువు కాలనీలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో వారిని ఆప్యాయంగా పలకరించి ఇంటిలో ఎవరెవరికి ఏయే పథకాలు అందుతున్నాయి అని ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు, టీడీపీ నేతల ఆదేశాలు ఉంటే తప్ప లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వచ్చేవి కాదన్నారు. అలాంటి పైరవీలకు చెక్ పెడుతూ నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజల చెంతకే పాలనను తీసుకురావడం కోసమే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామంటున్నారని, దీంతో టీడీపీ నేతలకు ప్రజల చెంతకు పాలన వెళ్లడం ఇష్టం లేదని అర్థమవుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల పక్షపాతిగా గుర్తింపు పొందారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం జగ్గయ్య చెరువు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ

పిఠాపురం: రామచంద్రాపురంలో ఈ నెల 18, 19 తేదీల్లో ఎంపిక చేసిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్ల క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వరకూ నూజివీడులో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే వీరందరికీ ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ జట్లలో ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి బాలురకు ఈ నెల 25 నుంచి అమలాపురంలోనూ, బాలికలకు ఈ నెల 27 నుంచి రామచంద్రాపురంలోనూ శిక్షణ ఇస్తారన్నారు.

శిక్షణకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు

బాలురు – ఉమామహేశ్వరరావు, భవానీశంకర్ (పిఠాపురం), చాణుక్య (ఢిల్లీ), వై.శ్రీనివాస్ (సామర్లకోట) బి.వరప్రసాద్, బి.దేవేంద్రసాయి, ఎస్‌కే ఇబ్రహీం (గొల్లలమామిడాడ) ఫణీంద్ర, రాజేష్ (ఏపీఎస్‌పీ) అనిల్ కుమార్, హర్షిత్ (రాజమహేంద్రవరం) సత్యసాయి, సుబ్రహ్మణ్యం (ముమ్మిడివరం) వి.అఖిల్, వై.పవన్‌కుమార్, బి.కామత్, జి.ప్రసాద్ (రామచంద్రపురం) కార్తీక్, నందు (అమలాపురం), ఆర్.గర్విన్, నిరంజన్ (డీఎస్‌ఏ)

బాలికలు– బీవీ దుర్గ, ఎన్.రత్నకుమారి, పి.మాధురి, పి.ఆషా (గొల్లల మామిడాడ), పీఎల్ మానస, అషిత, హాసిని (డీఎస్‌ఏ), లావణ్యశ్రీ, సీహెచ్ రేవతి, డి.హాసిని (అమలాపురం), కేజీ దీపిక, ఎస్ఎస్ దేవి, జి. పావనికుమారి (రామచంద్రపురం), పి.ప్రవల్లిక (గొల్లల మామిడాడ)లను ప్రత్యేక శిక్షణ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు.

రూ.90 లక్షలతో పైప్‌లైన్ల అభివృద్ధి



పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా కౌన్సిల్ పాలన సాగిస్తుందని పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. పట్టణంలో మెయిన్‌రోడ్డులో సుమారు రూ.90 లక్షలతో చేపట్టే పైపులైన్ నిర్మాణ పనులకు శనివారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, డిఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్



కొడవలిలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జూలై 1 నుంచి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించాలన్నారు. ప్రజలకు అవసరమైన కులం, ఆదాయం, జనన, మరణ, వివాహ ధ్రువపత్రాలను ఉచితంగా అందించాలన్నారు. సచివాలయాల్లో అందిస్తున్న సేవలను మరింత ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సమావేశాలు

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని ప్రతి గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్షపై అడ్మిన్ల అధ్యక్షతన శనివారం సమావేశాలు నిర్వహించారు. వలంటీర్ల పరిధిలోని ప్రతి 50 ఇళ్లకు వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకోవాలన్నారు. జూలై ఒకటి నుంచి వారికి కావలసిన సర్టిఫికేట్లు ఉచితంగా అందజేస్తామని తెలియజేయాలన్నారు. అలాగే ఇప్పటి వరకు నవరత్న పథకాలు అందని వారిని కూడా గుర్తించాలని అడ్మిన్‌లు వలంటీర్లకు సూచించారు. వార్డుల కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పిఠాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు అర్హులకు అవసరమైన ధ్రువపత్రాలు మంజూరు చేయాలన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలకు సురక్షపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర రామచంద్రయ్య, తహసీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి విజయ గౌరి, వీఆర్‌ఓ గోవింద్, ఆర్‌ఐ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన డ్రైన్‌లో చెట్ల తొలగింపు



సామర్లకోట: స్థానిక గాంధీ చౌక్ నుంచి రైల్వే గేటు మీదుగా వెళ్తున్న ప్రధాన డ్రైనులో పడిపోయిన చెట్లను శనివారం తొలగించారు. ఈ నెల 18న సాక్షి దినపత్రికలో 'చెట్ల అవశేషాలను తొలగించండి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ జె.రామారావు స్పందించారు. రైల్వే అధికారులతో చర్చించి రైల్వేకు చెందిన క్రేన్ సహాయంతో చెట్ల అవశేషాలు తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఈదురు గాలులకు ప్రధాన డ్రైన్ సమీపంలో ఉన్న చెట్లు కూలిన విషయం తెలిసిందే. గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రోడ్డు రైల్వేకు చెందినది కావడంతో వారి సహకారం తీసుకున్నట్టు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. చెట్ల అవశేషాలను కావలసిన వారు ఉచితంగా తీసుకువెళ్లవచ్చునని కమిషనర్ చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



చెట్ల అవశేషాలను తొలగిస్తున్న క్రేన్